సరిగ్గా అరగంట తర్వాత తిరిగి మహదేవ్ ఇంటికి చేరుకున్నాడతను. అప్పటికింకా అభిరాం, మహదేవ్‌లు ఏవో కబుర్లలోనే వున్నారు. వరప్రసాదం కూడా వాళ్ళ మాటల్లో పాలుపంచుకున్నాడు.

"స్ ..... స్స ..... స్స ..... " మనే ధ్వని వినిపించడంతో మాటలాపేసి చెవులు రిక్కించి వినసాగాడు వరప్రసాదం. స్పష్టంగా విన్పిస్తోంది గాలిని చీల్చుకుంటూ ఏదో కదలాడిన వింత ధ్వని.

వరప్రసాదం లేచి ఆ ధ్వని వస్తున్న దిక్కుగా నడిచాడు. "స్స ..... స్స ..... స్స ..... స్స' అతను నడుస్తున్న కొద్దీ మరింత తీవ్రంగా వినిపించసాగిందా ధ్వని.

ఇక్కడినుంచే ..... ఇక్కడినుంచే వస్తుంది-హాల్లోకి చేరుకుని అనుకున్నాడతను. హాలు నలుమూలలా చూశాడు. ఏమీ కనిపించడంలేదు. ధ్వని మాత్రం విన్పిస్తోంది ..... ఈసారి తనకంటే ఎత్తునుంచి ఆ శబ్దం రావటం స్పష్టంగా తెలుస్తుందతనికి.

తలెత్తి చూశాడు. తెల్లని సీలింగ్ తప్ప ఏమీ లేదక్కడ. ఆకారం లేని ప్రాణేదో అరుస్తున్నట్టు శూన్యంలోంచి శబ్ద తరంగాలు! ఈసారి ఆ శబ్దం మహదేవ్ గదివైపు సాగిపోవడం అతని చెవులకు స్పష్టంగా వినిపించింది. గబగబా ఆ శబ్దాన్ని అనుసరిస్తూ ముందుకు సాగిపోయాడు వరప్రసాదం.

మహదేవ్ గదిలో ప్రవేశించిన ఆ శబ్దం ఏ బిలంలోకో దూరిపోయినట్టు శబ్దరహితమైపోయింది.

అది కాదు అతడిని ఆశ్చర్యానికి గురిచేసింది. అప్పటివరకూ మామూలుగానే ఉన్న మహదేవ్ మొహం తెల్లగా పాలిపోవడం ..... !

చిత్రంగా కనురెప్పలు ఆర్పుతూ-

"ఇనీసా ఆర్మంద్ ..... ఇనీసా ఆర్మంద్" అంటూ నలుదిక్కులా చూడసాగాడతను. అభిరాంకి అతని ప్రవర్తన అర్థంకాలేదు. కాని అతని శరీరంలో ఏవో మార్పులు రావటం మాత్రం గమనించాడు.

వరప్రసాదం మహదేవ్ కెదురుగా నిలబడి అతన్నే తదేకంగా చూడసాగాడు.

"వేరీజ్ ఇనీసా ఆర్మంద్ ..... ఇనీసా ఐ యామ్ హియర్ ..... ఐ యామ్ హియర్" అంటూ పెద్దగా రోదన మొదలుపెట్టాడతను.

అభిరాం, వరప్రసాదం అవాక్కయి అతనివంక చూస్తుండిపోయారు.

"ఇనీసా ..... ఇనీసా ..... " అంటూ జుట్టు పీక్కుంటూ, బట్టలు చించేసుకోసాగాడు.

"మహదేవ్! ఏమైంది ..... ఏమైంది మహదేవ్?" అతన్ని ఆపటానికి ప్రయత్నిస్తూ అతని రెండు చేతుల్నీ తన చేతిలోకి తీసుకున్నాడు అభిరాం.

"హు ఆర్ యూ ..... " మహదేవ్ కంఠస్వరం చిత్రంగా వుంది. గరగరమంటూ ఏదో ఉక్కు చట్రాన్ని రాతికి రాస్తున్నట్టు.

“మహదేవ్! నేను ..... అభిరాంని” మరింత గట్టిగా అతని చేతుల్ని పట్టుకుని అన్నాడతను.

“యూ ఫూల్ గెటవుట్ ఫ్రం హియర్” ఒక్క తోపు తోశాడు అభిరాంని అతను.

గాల్లో విసిరేసిన రబ్బరు బంతిలా ఎగిరెళ్ళి గోడకు కొట్టుకున్నాడతను.

అతని నుదురు గోడకి తగిలి నెత్తురు చిందింది. కళ్ళు తిరుగుతున్నట్టు అనిపించింది. బలంగా తల విదిల్చి ..... నిలదొక్కుకుని లేచి నిలబడ్డాడు.

“ఇనీసా డార్లింగ్ ..... ఇనీసా డార్లింగ్” రెండు చేతులతో మొహం దాచుకుని ఏడవసాగాడు మహదేవ్.

అభిరాంకి అతని పరిస్థితి ఆందోళన కలిగించింది. అభిరాంని మాటాడొద్దన్నట్టు సైగచేశాడు వరప్రసాదం. అభిరాం మౌనం దాల్చాడు.

“కృపస్కయ ..... హే కృపస్కయ ..... ” ఎర్రని చింత నిప్పుల్లా మారిన కళ్ళతో అన్నాడతను.

అభిరాంకి వరప్రసాదానికి ఆ సమయంలో ఏం చెయ్యాలో అర్థం కాలేదు. పదినిముషాలపాటు చిన్నపిల్లాడిలా ఏవేవో కలవరిస్తూ ఏడ్చి, తరువాత సోషొచ్చి పడిపోయిన వాడిలా మంచం మీద వెనక్కి పడిపోయాడు అమాంతంగా.

“ఇదంతా ఏమిటి? కొంపదీసి ఏక్సిడెంట్ ప్రభావం వల్ల అతని మతిస్థిమితం తప్పలేదుకదా?” భయంగా అన్నాడు అభిరాం.

అతని నుదుటి నుంచి రక్తం వస్తూనే వుంది. అది గమనించి “రక్తం తుడుచుకోండి అభిరాం ..... మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి” అన్నాడు వరప్రసాదం.

“ఏమిటీ?” ఆత్రుత, భయం కలగాపులగమై వణుకుతున్న స్వరంతో అడిగాడతను.

“నిన్న రాత్రి నాకు నిద్దుర పట్టలేదు. ఎందుకో తెలుసా” అన్నాడు వరప్రసాదం.

“కొత్త ప్రదేశం అవటం వల్లని మీరే అన్నారుగా.”

“కాదు! ముందు బాగానే నిద్రపట్టింది. అయితే మధ్య రాత్రిలో హఠాత్తుగా మెలకువ వచ్చింది ..... ”

వరప్రసాదం చెప్పే విషయాన్ని ఆశ్చర్యంగా వినసాగాడు అభిరాం.

“ఎందుకు మధ్యలో అంత హఠాత్తుగా మెలకువ వచ్చిందో నాకే అర్థంకాలేదు. ఇంతలో ఏవో ధ్వనులు వినిపించాయ్. గాలిలో ఆకారంలేని నీడలేవో కదులుతున్నట్లూ, గాలిలోనే స్వైర విహారం చేస్తున్నట్లు శబ్దాలు వినిపించాయ్. నేనున్న దిక్కుగా ఎవరో నడిచి వస్తున్నట్టు అడుగుల ధ్వని .....

అంతే రాత్రంతా యిలాగే గడిచిపోయింది.

ఉదయం లేచి యిల్లంతా అణువణువూ శోధించినా ఏమీ కనపడలేదు. రాత్రి మామూలుగానే ఉన్న మహదేవ్‌బాబు మాత్రం లంఖణాలు చేసినట్లు కృశించిపోవటం నీకూ

తెలుసు ..... "

"మరి ఎందుకని చెప్పలేదు మీరు?"

"ముందు ఆ శబ్దాలు రావటం అవీ నా భ్రమేమో అనుకున్నాను. ఉదయం నుంచీ మామూలుగానే ఉన్న మహదేవ్‌బాబుని చూశాక నామీద నాకే అనుమానం వేసింది. నేను నిజంగా ఆ శబ్దాలు విన్నానా లేదా? అనుకున్నాను. అయితే ఇందాక నేను బయటికి వెళుతుండగా మరో సంఘటన జరిగింది."

"ఏమిటది?" అతని మాటలు పూర్తికాకుండానే అడిగాడు అభిరాం.

"గత పది పన్నెండు రోజులుగా మన పక్క ప్లాట్‌లో ఉన్న యింటిలోని కుక్క మహదేవ్ బాబు యింటిలోని కుక్క మహదేవ్ బాబు ఇంటిని చూస్తూనే అరుస్తోందట ..... అంటే దానికి కారణం ఏమిటో తెలుసా?"

"ఏమిటి?" అడిగాడు అభిరాం.

"కుక్కలకి గాలిలో విహరించే ఆత్మల్ని చూడగల శక్తి వుంటుంది. అందుకే అది బయటికి తీసుకొచ్చిన ప్రతిసారీ యిటు చూసి అరిచేదట. ఈ రోజు కూడా నేను గమనిస్తుండగా అలాగే అరిచిందది .....

"పది పన్నెండు రోజులుగా అరుస్తోందని అన్నారు. ఆ విషయం మీకెలా తెలుసు?"

"ఆ ఇంటి యజమానే చెప్పాడు."

అభిరాంకి అతను చెబుతున్న విషయాలకి చెమటలు పడుతున్నాయ్.

"నిన్న రాత్రి ఈ ఇంటిలో విన్పించిన విచిత్ర శబ్దాలు, మహదేవ్‌బాబు ఒక్క రోజులో శుష్కించిపోవడం, ఆ కుక్క యిటే చూసి అరవటం ..... ఇవన్నీ కలుపుకుంటూ ఆలోచించండి ..... ఈ యింటిలో ఆకారాలు లేని ఆత్మలేవో వున్నాయి."

వరప్రసాదం మాటలు వింటూనే ఒళ్ళు జలదరించింది అభిరాంకి.

"మనం సాధ్యమైనంత తొందరగా ఈ ఇంటినుంచి మహదేవ్‌బాబుని దూరంగా తీసుకుపోవాలి" అన్నాడు వరప్రసాదం.

అభిరాం తీవ్రంగా ఆలోచించసాగాడు.

'ఎందుకు జరుగుతుందిలా? అన్నింటికంటే ఆశ్చర్యం ..... వేటినయితే మహదేవ్ నమ్మడో ఆవే అతనిలో ప్రవేశించడం .....' అనుకున్నాడతను.

"ప్రస్తుతం ఏం చేద్దాం?" తనకి తోచనట్టు వరప్రసాదంను అడిగాడు అభిరాం.

"ఈ రాత్రికి చేయగలిగేదేమీ లేదు. ఉదయమే ఈ చోటునుంచి అతన్ని తీసుకుపోవాలి."

"ఎక్కడికి తీసుకెళదాం?"

"ఈ చోటునుంచి ఎక్కడికయినా ఫర్వాలేదు."

"మా యింటికి తీసుకుపోదామా?"

"అక్కడికా?" ఆశ్చర్యంగా అడిగాడు వరప్రసాదం.

"ఎందుకు అలా అడిగారూ?" అతని ఆశ్చర్యాన్ని గమనించి అడిగాడు అభిరాం.

"అక్కడికొద్దు ..... అమ్మమ్మ భయపడొచ్చు ..... ఇతన్ని వెన్నంటి ఏ గాలయినా వచ్చి భీభత్సం సృష్టించిందంటే ఈ వయసులో అటువంటివి చూసి తను తట్టుకోలేకపోవచ్చు" అన్నాడు.

"మరెక్కడికి తీసుకుపోదాం?"

"అది మీరే ఆలోచించాలి" అన్నాడు అభిరాం.

తన ఎగ్జిక్యూటివ్స్‌లో ఇద్దరు కుర్రాళ్ళు కలసి ఒక రూంలో వుంటున్నారు. వీలయితే అక్కడుంచవచ్చు- అనుకున్నాడు.

"మీరింక ఇంటికెళ్ళండి అభిరాం బాబూ! అమ్మమ్మ ఎదురుచూస్తూవుంటుంది" అన్నాడు వరప్రసాదం.

"లేదు! ఫోన్‌చేసి పనిమీద బయటికి వెళ్ళాల్సి వచ్చిందని చెప్పేస్తాను. ఎదురింట్లోని వాళ్ళ పనిపిల్లని తోడుగా పడుకోమని చెప్పమంటాను. ఇంతకుముందు కూడా నేనామెని వదిలి వుండవలసి వచ్చినపుడు అలాగే చేశాను. మీరొక్కరూ ఇక్కడుండటం నాకెందుకో ప్రమాదమనిపిస్తోంది. ఇంత నీరసంగా కనిపిస్తున్న మనిషి కూడా నన్ను బంతిలా ఎలా విసిరేశాడో మీరే చూశారుగా ..... "

అది కూడా నిజమే అనిపించింది వరప్రసాదానికి.

"ఒక పనిచేద్దాం. నేను ఫోన్ చేసి వచ్చేవరకూ మీరొక్కరూ ఈ గదిలో వుండద్దు. ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం వుంది. అందుకని ఈ గది తలుపులు మూసేద్దాం. మీరు హాల్లో కూర్చోండి. నేను ఫోన్‌చేసి అమ్మమ్మకి ఈ రోజు అర్జంటు పనిమీద వెళుతున్నానని చెప్పివస్తాను" అన్నాడతను.

"అలాగే!" అన్నాడు వరప్రసాదం.

మరుక్షణం మహదేవ్ ఉన్న గది తలుపు మూసి గొళ్ళెంపెట్టి హాల్లోకి నడిచారు యిద్దరూ.

అభిరాం బయటికి వెళ్ళిపోయాడు.

వరప్రసాదం హాల్లోని సోఫాలో కూర్చున్నాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా- రానున్న తుఫానుకు ముందటి ప్రశాంతతని తలపిస్తోంది. క్షణాలు భారంగా దొర్లుతున్నాయి.

వరప్రసాదం కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు.

'మహదేవ్ నోట్లోంచి వచ్చిన పదాలకి అర్థమేమిటి. బహుశా వ్యక్తుల పేర్లా? అయితే ఇనీసా ఎవరు? కృపస్కయి అంటే ..... ' అతను ఆలోచనలలో వుండగానే అభిరాం వచ్చేశాడు.

"ఫోన్ చేశారా?" అడిగాడు వరప్రసాదం.

“ఆఁ ..... ” అన్నాడతను.

ఇద్దరూ మెల్లగా నడుస్తూ వెళ్ళి చప్పుడు కాకుండా మహదేవ్ గది తలుపులు తెరిచారు.

ఒక్క క్షణం ఉలిక్కిపడ్డారు. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి.

మంచంమీద కూర్చుని వున్న మహదేవ్ అగ్నిగోళాల్లాంటి కళ్ళతో, బుగ్గల నుంచీ, చేతుల నుంచీ కారుతున్న నెత్తురుతో భయానకంగా కనిపించాడు. లోపలికొస్తున్న ఇద్దరివంకా రౌద్రంగా చూశాడు.

వరప్రసాదం అభిరాంని ఆపేశాడు.

“హు ఆర్ యూ” అని తీవ్రంగా అడిగాడు ముందుకొస్తున్న అభిరాంని చూసి.

“ఐయామ్ అభిరాం ..... మే ఐ నో యువర్‌గుడ్ నేమ్ ప్లీజ్” శాంతంగా అన్నాడు అభిరాం. అప్పుడతను చెప్పిన పేరు విని యిద్దరూ స్థంభించిపోయారు.

*  *  *  *  *

అది జటాజూటధారి నివాసం!

అలసిన శరీరాలు సొక్కిసోలిపోయి ఆత్మలుగా మారే ఆవాసం. భ్రష్ట రోదనలతో, అపశ్రుతులు నిండిన వికృత సంగీత సామ్రాజ్యం.

వెలుగెరుగని మసిబారిన చిక్కని చీకట్లు నిండిన ప్రదేశం. అది మొదలుకుని అంతంవరకూ చివరికి శూన్యంతో కలిపి ఎక్కడాలేని గాలి ఆ ప్రదేశంలో చేరి బ్రహ్మప్రళయం వచ్చినట్లు రొద ..... చెవులు తెగి కింద పడిపోతాయేమో అన్నంతగా .....

మహావృక్షాలు సైతం గడ్డిపోచలై గజగజలాడుతున్నాయి. భీకరుడై, గంభీరుడై, ఏకాగ్రతకు మారుపేరులా విలయతాండవం చేస్తున్న ప్రకృతిని ఎంతమాత్రమూ పట్టించుకోకుండా తదేకదీక్షతో మంత్రాలు పఠిస్తున్నాడతను.

“ఓం ఐం గ్లౌం ఖం వార్తాళి వారాహే!
వారాహ ముఖి ఐం గ్లౌం ఐం అంధే అంధిని
నమో రుధే రుంధిని! నమోజ భేజంభిని!
నమః స్తంభే స్తంభినీ నమో! సర్వ శక్తిహిం!
సర్మ చక్షుర్ముఖగతి! సర్వావయన స్తంభనం
శీఘ్రుం కరు ఐం ..... ఐక్యతీం ప్రాణమ్ ..... ఐం
పంచభూతాయ నమః ఐం గ్లౌం ఫట్‌స్వాహా!!”

అని మంత్రపఠనం పూర్తవటం, దిక్కులన్నీ దద్దరిల్లినట్లు ఆకాశం భయంకరంగా ఉరమడం ఒకేసారి జరిగింది.

తృప్తిగా నిట్టూర్చి ..... చిన్న మట్టి బొమ్మకి శరీరమంతా నూట ఎనిమిది ముళ్ళు గుచ్చి ధూపం వేసి, పాత్రలోని రక్తంతో అభిషేకించి చేతిలోని ఎముకతో తాకాడు.